క్లుప్తంగా

కొనసాగుతున్న చేరికల పర్వం


పార్టీలో చేరిన వారికి కండువా వేసి సాదరంగా ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వైఎస్సార్ సీపీలో చేరికల పర్వం కొనసాగుతుంది. సంధిపూడిలో పీఏసీఎస్ అధ్యక్షుడు మోటుపల్లి వెంకన్న, గ్రామ కమిటీ అధ్యక్షుడు పోలాబత్తుల చిన్న, పార్టీ నేత తోరాటి గోవిందు ఆధ్వర్యంలో ఇప్పటికే ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి సమక్షంలో యాదవులు, బీసీ, కాపు యువత పార్టీలోకి చేరింది. గోపాలపురంలోని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి నివాసంలో సోమవారం రాత్రి గ్రామ వార్డు మెంబర్ జంగం సత్తిబాబు, సబ్బితి జోసఫ్‌రాజు, సబ్బితి దుర్గాప్రసాద్, సబ్బితి రాజు, గోడి సురేష్ తదితరులు సుమారు 100 మంది ఎస్సీ యువకులు పార్టీలో చేరారు. వీరందరికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు అహర్నిశలు శ్రమిస్తామని హామీ ఇచ్చారు.

ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం


బాధితుడి కుటుంబ సభ్యులకు సాయం అందజేస్తున్న కాశీఅన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు మంగళవారం రూ.12,500 నగదు సాయాన్ని వైద్య ఖర్చుల నిమిత్తం అందజేశారు. మండలంలోని పొడగట్లపల్లి శివారు జనిపిరెడ్డి వారి పాలెంకి చెందిన జనిపిరెడ్డి యేసు కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇతనికి ఇద్దరు పిల్లలు రెండు వారాలు క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాల పాలవడంతో అమలాపురంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అపస్మారక స్థితిలో ఉన్నాడు. బాధితుడి బంధువులు కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సహాయం కోరడంతో రూ.12,500 నగదు సాయంగా అందజేసినట్టు సభ్యులు తెలిపారు.

అగ్నిప్రమాద బాధితుడికి ఎమ్మెల్యే పరామర్శ


పేరవరంలో సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: మండలంలోని పేరవరం గ్రామానికి చెందిన చిట్టూరి కామేశ్వరరావు టెంట్‌హౌస్ ఇటీవల అగ్నిప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. దీంతో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి విషయం తెలుసుకుని మంగళవారం సాయంత్రం స్థానిక నాయకులతో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకుని బాధితుడికి భరోసా ఇచ్చారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

అంబాజీపేట: బాలింతలు, గర్భిణుల్లో రక్తహీనత నివారణకు 10 రకాల పోషకాహార పదార్థాలతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని పి.గన్నవరం సీడీపీఓ వై.విజయశ్రీ అన్నారు. పోషణ్ పక్వాడాలో భాగంగా మాచవరం అంగన్‌వాడీ సెంటర్‌లో పోషకాహార మాసోత్సవాలను అంగన్‌వాడీ టీచర్ బీఏ ఆశాలత అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. సీడీపీవో విజయశ్రీ మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు 10 రకాల వైఎస్సార్ పోషకాహార కిట్లను అందించనున్నామన్నారు. ఈ నెల 23వ తేదీ వరకు పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. అనంతరం పోషణ్ పక్వాడా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

ఆలమూరు: మండలంలోని మూలస్థాన అగ్రహారం, జొన్నాడ గ్రామాల్లో మంగళవారం ఉజ్వల్ యోజన పథకం ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీ జరిగింది. కొత్తపేట బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అయినవిల్లి సత్తిబాబు ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారులకు ఈ కనెక్షన్లను అందజేశారు. మండల బీజేపీ శాఖ అధ్యక్షుడు నాగిరెడ్డి స్వామి నాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యుడు కొవ్వూరి సీతారామరెడ్డి, సిద్ధాంతి రాజు, మిద్దె పురుషోత్తం పాల్గొన్నారు.


అంబాజీపేటలో పార్టీ ఆవిర్భవ దినోత్సవాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు


రాజోలులో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న నియోజకవర్గ సమన్వయకర్త గొల్లపల్లి సూర్యారావు


పి.గన్నవరంలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవ కేక్ కట్ చేస్తున్న నాయకులు


చెముడులంకలో మిఠాయిలను తినిపిస్తున్న మండల కన్వీనర్ తమ్మన


కొత్తపేటలో మాజీ సీఎం రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పేదల కష్టాలు తెలిసిన పార్టీ వైఎస్సార్ సీపీ

- ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, కోఆర్డినేటర్


మలికిపురంలో పార్టీ ఆవిర్భావ సభలో ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావుకు కేక్ తినిపిస్తున్న కార్యకర్తలు

రాజోలు: పేదల కష్టాలు తెలిసిన పార్టీగా వైఎస్సార్ సీపీ రాష్ట్రంలో కీర్తి గడించిందని రాజోలు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మంగళవారం ఆయన రాజోలు మార్కెట్ సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ 14వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. మాజీ మంత్రి గొల్లపల్లి పాల్గొని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేశారు. మాజీ సీఎం వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ ప్రజా సంకల్పయాత్ర ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకుని వాటికి పరిష్కార మార్గాలు అన్వేషించారన్నారు. దానిలో భాగంగానే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి విరాజిల్లుతోందన్నారు. సర్పంచ్ రేవు జ్యోతి, ఎంపీటీసీలు చెల్లింగి లక్ష్మీఈశ్వరి, కొపనాతి పుష్పలత, బండారు కాశీ, సరెళ్ల విజయ ప్రసాద్, కొల్లాబత్తుల కుమార్, అడబాల జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.

మలికిపురంలో..

మలికిపురం: సీఎం జగన్ ఆదేశాలను శిరసావహిస్తానని, రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో పార్టీ అధికారంలోనికి వచ్చి సీఎంగా జగనే ఉండాలని రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు అన్నారు. మలికిపురంలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. మలికిపురం కూడలిలో మాజీ సీఎం వైఎస్సార్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కేక్‌ను ఆయన కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచారు. తొలుత రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మరో 20 ఏళ్ల పాటు జగన్‌కు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ అడబాల వీర బ్రహ్మాజీ, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, జెడ్పీటీసీలు మట్టా శైలజ, దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్‌లు గెడ్డం రాజ్యలక్ష్మి, నాయకులు గెడ్డం తులసీ భాస్కర రావు, కంచర్ల శేఖర్, గుబ్బల మనోహర్, రుద్రరాజు చిన్నరాజా తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలో..

కొత్తపేట: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని కొత్తపేటలో ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లో మాజీ సీఎం వైఎస్సార్ విగ్రహానికి స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రను తిరగరాసే విధంగా కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా ప్రజా సంక్షేమం, రాష్ట్రం ప్రగతి పథం ప్రధాన అజెండాగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ సీపీ ఆవిర్భవించిందని, ఆ విధంగానే ఈ ప్రభుత్వం పరిపాలన సాగిస్తుందన్నారు. పార్టీ లక్ష్యానికి అనుగుణంగా నియోజకవర్గంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమ లక్ష్య సాధనకు అనుగుణంగా ముందుకు వెళుతున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని మళ్లీ అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పేపకాయల బ్రహ్మానందం, గ్రామ పార్టీ అధ్యక్షుడు సలాది బ్రహ్మాజీ, జీబీహెచ్ పీఏసీఎస్ చైర్మన్ బీర శ్రీనివాసరావు, పార్టీ బీసీ విభాగం సభ్యులు రాయుడు కృష్ణ, యాళ్ల బంగార్రాజు, ఎస్సీ విభాగం సభ్యుడు పాలంగి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరులో..

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో పార్టీ ఆవిర్భావం దినోత్సవం ఘనంగా జరిగింది. మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు ఆధ్వర్యంలో పార్టీ నేతలు, కార్యకర్తలు ఆయా గ్రామాల్లోని వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఆవిష్కరించి కేక్‌ను కట్ చేసి మిఠాయిలు పంచారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన గత ఐదేళ్లలో పేదల అభ్యున్నతికి సీఎం జగన్, నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి చేసిన కృషిని వివరించారు. అనంతరం దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర చరిత్రలో వైఎస్సార్ పాత్ర మరువలేమని ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు అన్నారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న సీఎం జగన్‌ను మళ్లీ గెలిపించాలని మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక అక్విడెక్టు పార్కులో మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాజశేఖరరెడ్డి విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా కేకును కట్ చేశారు. కార్పొరేషన్ డైరెక్టర్ మద్దుల వరలక్ష్మి, రాష్ట్ర నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, దొమ్మేటి వెంకట శివరామన్, యన్నాబత్తుల ఆనంద్, సర్పంచ్‌లు తోలేటి బంగారునాయుడు, కొంబత్తుల ఏసుబాబు, వడలి కొండయ్య, నాయకులు సాధనాల రమేష్, కడలి వెంకటరమణ, పుచ్చకాయల నర్సింహమూర్తి, కొక్కిరి రవికుమార్, అడ్డగళ్ల శ్రీను, యడ్లపల్లి ఏసుబాబు, నూకపెయ్యి రాజేంద్రప్రసాద్, కేతా శ్రీను, కొల్లాటి వెంకట్రావు, వెర్రిబాబు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: వైఎస్సార్ సీపీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి, పార్టీ ఆవిర్భావం నుంచి ఒకే ఒక్కడిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అంచెలంచెలుగా ఎదిగి ప్రజా నాయకుడిగా దేశంలో గుర్తింపు పొందారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావు అన్నారు. అంబాజీపేట బస్టాండ్ ఎదురుగా ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించి, పార్టీ ఆవిర్భావ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళ్లర్పించారు. అనంతరం కేకును కట్ చేసి అభిమానులకు పంచారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, కొర్లపాటి కోటబాబు, ముత్తాబత్తుల ప్రశాంత్, మట్టపర్తి హరి, గోసంగి కుమారస్వామి, కోట సత్తిబాబు తదతరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే మహిళాభ్యున్నతి

ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు


మలికిపురంలో మహిళలకు చేయూత నమూనా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు

మలికిపురం: రాష్ట్రంలో మహిళాభ్యున్నతి సీఎం జగన్‌తోనే సాధ్యమైందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మంగళవారం మలికిపురం మండల పరిషత్ కార్యాలయం వద్ద వైఎస్సార్ చేయూత నాలుగో విడత కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే రాపాక చేతుల మీదుగా 3822 మంది లబ్ధిదారులకు రూ.7.1 కోట్ల చెక్ ద్వారా పంపిణీ జరిగింది. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళల జీవనోపాధి కార్యక్రమాలకు ఆర్థికంగా అనేక రకాల సంక్షేమ పథకాలు అందిస్తున్నారని అందులో భాగంగానే వైఎస్సార్ చేయూత ద్వారా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేశారన్నారు. ఇప్పుడు నాలుగో విడతగా మరో రూ.18750 లు జమ చేశామని అన్నారు. ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి, ముత్యాల కాశీ, ఎంపీడీఓ ముత్యం వీరాస్వామి నాయుడు, తహసీల్దార్ జి.అనితకుమారి తదితరులు పాల్గొన్నారు.

రాజోలులో..

రాజోలు: రాష్ట్రంలోని అక్కచెల్లెమ్మల ఆర్థిక స్వావలంబనకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మంగళవారం రాజోలు మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్ చేయూత నాలుగో విడత ఆర్థిక సాయం నమూనా చెక్కును మహిళలకు అందజేశారు. మండలానికి చెందిన 3,890 మంది డ్వాక్రా మహిళలకు రూ.7.29 కోట్ల చేయూత పథకం ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి, ఎంపీపీ కేతా శ్రీనివాస్, సర్పంచ్‌లు రేవు జ్యోతి, నక్కా రామారావు, ఎంపీటీసీలు చెల్లింగి లక్ష్మీ ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: మహిళా సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే రాపాక అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీపీ వద్ద మండలంలోని 3525 మంది అక్కాచెల్లెమ్మలకు వైఎస్సార్ చేయూతలో నాలుగో విడతగా మంజూరైన రూ.6,60,93,750 విలువైన మెగా చెక్కును ఎమ్మెల్యే రాపాక అందజేశారు. జెడ్పీటీసీలు దొండపాటి అన్నపూర్ణ, మట్టా శైలజ, వైస్ ఎంపీపీ రాపాక దీవెన కుమారి, కో ఆప్షన్ మెంబర్ బళ్ల నోబుల్ ప్రభాకర్, ఎంపీడీవో పీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు జగన్ ప్రాధాన్యం


అంబాజీపేటలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: రైతులకు అన్ని విధాలుగా ప్రోత్సాహాలు అందించి వారిని జగన్ సర్కారు ఎంతగానో ప్రోత్సహిస్తోందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. పాశర్లపూడిలంకలో రూ.23.94 లక్షలతో నిర్మించిన ఆర్బీకేని ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు ఆర్బీకేలను ప్రోత్సహించిందన్నారు. జగన్ సర్కారుకు వచ్చే ఎన్నికల్లో ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, ఎంపీటీసీ చెరుకూరి పార్వతీదేవి, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, ఉప సర్పంచ్ విప్పర్తి రమణ, కుడుపూడి అబ్బులు, బాలం రమేష్, బొరుసు బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మాచవరం సచివాలయం-4లో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని మంగళవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ గ్రామ సచివాలయాన్ని రూ.43.62 లక్షలతో నిర్మించామన్నారు. అలాగే దొమ్మేటివారిపాలెంలో వినాయక గుడివద్ద రోడ్డును ఎంపీ నిధులు రూ.12 లక్షలు, గడపగడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.5 లక్షలు, పంచాయతీ నిధులు రూ.5 లక్షలతో నిర్మించనున్నామన్నారు. అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద గంగలకుర్రు అగ్రహారం సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు అధ్యక్షతన చెందిన 13 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఉభయ గోదావరి జిల్లాల గ్రీవెన్స్ కన్వీనర్ పేరి శ్రీనివాస్, జేసీఎస్ మండల కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, ఎంపీటీసీ మట్టా పార్వతి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రారంభోత్సవాలు

సఖినేటిపల్లి: మండలంలోని రెండు గ్రామాల్లో మంగళవారం రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. రామేశ్వరంలో కొత్తగా నిర్మించిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. అలాగే అప్పనరామునిలంకలో కొత్తగా నిర్మించిన సచివాలయ భవనాన్ని, తాగునీటి ట్యాంకును కూడా ఆయన ప్రారంభించారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, ఎంపీటీసీ దొండపాటి సునీత, పెదపాటి నాగలక్ష్మి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

సఖినేటిపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకు పోలీసు ఉన్నతాధికారులు సూచనలపై మంగళవారం రాజోలు సీఐ గోవిందరాజు ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ పోలీసు బలగాలు కవాతు నిర్వహించారు. మండలంలోని వీవీ మెరక, మోరి, మోరిపోడు, కేశవదాసుపాలెం, అంతర్వేదికర గ్రామాల్లో ఈ మేరకు వారు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎటువంటి అల్లర్లు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా సాయుధ బలగాల పోలీసులతో కవాతు చేస్తున్నట్టు సీఐ అన్నారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అందుకూ సహకరించాలని ఆయన కోరారు.

ఓటు హక్కు విలువను గుర్తించాలి


అంబాజీపేటలో ఓటు హక్కుపై ర్యాలీ నిర్వహిస్తున్న ప్రొడ్యూసర్స్ కంపెనీ ప్రతినిధులు, అధికారులు, స్థానికులు

కొత్తపేట: సమాజంలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ పిలుపునిచ్చారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మంగళవారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు, సిబ్బందికి ఓటు హక్కు వినియోగంపై అవగాహన నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని శ్రీకృష్ణదేవరాయ సభా ప్రాంగణంలో జరిగిన కార్యక్రమానికి సీడీపీఓ పి.శారద అధ్యక్షత వహించగా ఆర్డీవో సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్క ఓటుకు ఎంతో విలువ ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.ఎలీషా, ఎంపీడీఓ కె.వాణి తదితరులు పాల్గొన్నారు. అదే ప్రాంగణంలో ఐసీడీఎస్ 'పోషణ్-పక్వాడా' కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలు ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను ఆర్డీవో సత్యనారాయణ, ఎంపీడీఓ కె.వాణి తిలకించి, పదార్థాలను పరిశీలించి రుచి చూశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: ప్రతి ఒక్కరూ ఓటు హక్కు విలువను గుర్తించి సద్వినియోగం చేసుకోవాలని కృషీవల కోకోనట్ ఫార్మర్స్, ప్రొడ్యూసర్స్ కంపెనీ చైర్మన్ గణపతి వీరరాఘవులు అన్నారు. అంబాజీపేట ప్రొడ్యూసర్స్ కంపెనీ కార్యాలయంలో భారత ఎన్నికల సంఘం ఆదేశాలతో కార్మిక, పరిశ్రమల శాఖ సహకారంతో ప్రొడ్యూసర్స్ కంపెనీ ఆధ్వర్యంలో నీ ఓటు నీ భవిష్యత్... ప్రజాస్వామ్యంలో ఓటు బలమైన ఆయుధం అనే కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

ప్రజాస్వామ్యంలో ఓటే ఆయుధం

మామిడికుదురు: ప్రజాస్వామ్యంలో ఓటే బలమైన ఆయుధమని, నీ ఓటు, నీ భవిష్యత్తు అని నినదిస్తూ మంగళవారం రైతులు మామిడికుదురు, మాకనపాలెం గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. కోనసీమ కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ, నారియల్ భారత్ న్యూట్రా ప్రొడ్యూసర్ కంపెనీ ప్రతినిధులు ర్యాలీలో పాల్గొన్నారు. ఓటును అమ్ముకోవద్దు, నిస్వార్థంగా సేవలందించే వారిని ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోండి, ఓటు అమ్ముకోవడం చట్టరీత్యా నేరం అంటూ నినాదాలు చేశారు.

మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి


అంతర్వేదిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పిల్లలతో మాట్లాడుతున్న డీఈవో కమలకుమారి

సఖినేటిపల్లి: పది పరీక్షల్లో టీచర్ల సూచనలు అనుసరించి ప్రణాళికాబద్ధంగా చదువుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి పిల్లలకు సూచించారు. మంగళవారం అంతర్వేదిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పదో తరగతి విద్యార్థులతో రానున్న పరీక్షలపై ముఖాముఖి నిర్వహించారు. అన్ని సబ్జెక్టుల్లో ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. అలాగే ప్రీ ఫైనల్ ఎగ్జామ్ ప్రశ్నపత్రాలను ఆమె పరిశీలించారు. పాఠశాల హెచ్‌ఎం జె.సుగుణ, బోధన సిబ్బందికి పలు సూచనలు చేశారు. మిగతా తరగతుల్లో పిల్లల నోట్స్ కరెక్షన్స్ డీఈవో పరిశీలించారు. ఇదిలా ఉండగా మండల పరిషత్ కార్యాలయంలో ఉన్నత, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పాఠశాల తనిఖీ శిక్షణ కార్యక్రమం ఎంఈవో-1 డి.కిషోర్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా డీఈవో కమల కుమారి, సెక్టోరియల్ జిల్లా అధికారి బి.సుబ్రహ్మణ్యం, రిసోర్స్ పర్సన్‌గా గుబ్బల శ్రీనివాసు పాల్గొన్నారు. సామాజిక తనిఖీ యాప్‌లో నమోదు చేసే విధానాలను, ఇటీవల నిర్వహించిన టీఎల్‌ఎం మేళాలో విజేతలైన టీచర్లకు బహుమతులను డీఈవో అందజేశారు.

93 మందికి కంటి పరీక్షలు

పి.గన్నవరం: ముంగండలోని మంత్రవాది ఇందిరాకుమారి స్మారక గ్రామీణ వైద్యాలయంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 93 మందికి కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వారిలో 18 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తారని హోమియో వైద్యుడు ఖండవిల్లి నాగేశ్వరరావు తెలిపారు. వేమగిరికి చెందిన పరమహంస యోగా కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ వైద్యశిబిరం నిర్వహించారు.

రానున్న ఎన్నికల్లో బీసీలకు ఎక్కువ సీట్లు ఇవ్వాలి

పి.గన్నవరం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీసీలకు ఎక్కువ సీట్లు ఇవ్వాలని జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు విత్తనాల ప్రభాకర్ రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసే బీసీ అభ్యర్థుల విజయానికి బీసీ కులస్తులంతా కృషి చేయాలని కోరారు. ఈనెల 17న తాళ్లరేవు మండలం సుంకరపాలెం శివారు చింతాకుల ప్రాంతంలో జరిగే బీసీ ప్రతినిధుల సదస్సును విజయవంతం చేయాలని ప్రభాకర్ కోరారు.

ఉసిరి... ఆరోగ్య సిరి


విక్రయానికి సిద్ధంగా ఉన్న ఉసిరికాయలు

అంబాజీపేట: ప్రకృతి ఒక్కో ఋతువులో ఒక ఫలాన్ని మానవ ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు ప్రసాదించింది. వేసవిలో లభించే మామిడికాయ తర్వాత ఎన్నో రకాలుగా ఆరోగ్యసిరి పెంపొందించే ఉసిరి ఈ కోవలోకి వస్తుంది. వేదకాలం నుంచి ఉసిరిని వినియోగిస్తున్నట్లు దాఖలాలున్నాయి. దీని యొక్క శాస్త్రీయ నామం ఫిలాంథస్ ఎంబ్లికా. ఇది యుఫోర్బియేసి కుటుంబ జాతికి చెందిన మొక్క. ఉసిరిని హిందీలో ఆమ్లా అని, సంస్కృతంలో ఆమ్లాకీ అని తెలుగులో ఉసిరి అని అంటారు.

ఉసిరిలో పోషకాలు

ఉసిరిలో సోడియం 1.5 మిల్లీ గ్రాములు, పొటాషియం 2.97 మిల్లీ గ్రాములు, కార్బోహైడ్రేట్స్ 15 మిల్లీగ్రాములు, కొవ్వు 0.9 మిల్లీ గ్రాములు, ప్రొటీన్లు 1.3 గ్రాములు, పీచు పదార్థాలు 6.5 గ్రాముల ఉంటాయి. రసాయనాల విషయానికొస్తే విటమిన్ సి,టానిన్లు, గ్లూకోజ్,పెక్టిన్, ఖనిజ మూలాలైన ఐరన్, ఫాస్ఫరస్, కాల్షియం, గాలిక్, ఇల్లాజిక్, ఫిల్లెంబ్లిన్ ఆమ్లాలు, యాంటీ ఆక్సిడెంట్లు, ఫ్లవనాయిడ్స్, కెరోటినాయిడ్స్, సమృద్ధిగా ఉంటాయని పి.గన్నవరం గ్రేస్ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకుడు పితాని గోపాలకృష్ణ తెలిపారు. ఉదర సంబంధ వ్యాధులు అరికట్టేందుకు, వాత, పిత్త, కఫాలను అదుపులో ఉంచేందుకు, మహిళలకు గర్భసంచిలో రక్త స్రావాన్ని, ల్యుకోమియా వ్యాధిని, వాంతులు, విరేచనాలు, అల్సర్, ఎసిడిటీని అరికట్టి జీర్ణశక్తిని పెంచేందుకు ఉపయోగపడుతుంది. ఉసిరిలో విటమిన్-సి ఎక్కువగా ఉండటంతో రోగ నిరోధకశక్తిని పెంపొందించే చవనప్రాష్, త్రిఫల చూర్ణం తయారీకి ఉపయోగపడుతోంది. ఉసిరి చెట్టులోని బెరడు, ఆకులు, పూలు, వేళ్లు, కాయలు, గింజలు, పూర్తిగా ఆయుర్వేద మందుల్లో ఉపయోగపడతాయి. కొబ్బరినూనె, షాంపూల తయారీకి, చుండ్రు నివారణకు, వెంట్రుకలు నల్లబడటానికి, వత్తుగా పెరిగేందుకు, తలపోటు నివారకు, మెదడును చల్ల బర్చేందుకు, ఉపయోగపడుతుంది.

నూకాంబిక అమ్మవారికి గ్రామోత్సవం

ఆలమూరు: మండలంలోని సంధిపూడిలో నూకాంబిక అమ్మవారికి మంగళవారం వైభవంగా గ్రామోత్సవం జరిగింది. ఈనెల 23 వరకూ మండలంలోని వివిధ గ్రామాల్లో అమ్మవారు బుట్టగరగ రూపంలో దర్శనమివ్వనున్నట్లు ఈఓ ఎంఎస్ఆర్ కృష్ణ, జేఏ డి.భాస్కర్ తెలిపారు.